# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను
వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక
సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
• జిల్లా బ్యూరో చీఫ్‌లు
• జిల్లా స్టాఫ్ రిపోర్టలు
• నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
• మండల రిపోర్టర్లు కావలెను




సంపుటి : 2 సంచిక : 296 ఆదివారం 9 జూన్ 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# అస్తమించిన ఉషాకిరణం





- అక్షర యోధుడు రామోజీకి అశ్రునివాళి
- ఈనాడు' రామోజీరావు అస్తమయం
- గత కొంతకాలంగా పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రామోజీరావు
- ఆరోగ్యం క్షీణించడంతో హైదరాబాద్‌లోని నానక్ రామ్ గూడలోని స్టార్ ఆసుపత్రిలో చికిత్స
- వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూనే తుదిశ్వాస విడిచిన రామోజీరావు

*తెలుగు మీడియా మొఘల్‌గా పేరుపొందిన ఈనాడు సంస్థల చైర్మన్ రామోజీరావు శనివారం తెల్లవారుజామున 4.50 గంటలకు కన్నుమూశారు. 88 ఏళ్ల ఆయన వయసు రీత్యా తీవ్ర అనారోగ్యం కారణంగా తుదిశ్వాస విడిచారు. గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో నానక్ రామ్ గూడలోని స్టార్ ఆసుపత్రికి తరలించారు. వెంటిలేటర్‌పై వైద్య చికిత్స పొందుతూనే ఆయన తుది శ్వాస విడిచారు.*

3

# కొత్త పాలన!

- త్వరలో కొత్త సీఎస్, డీజీపీ?
- ఎన్నికల కోడ్ ముగియడంతో తిరిగి ప్రజాపాలనపై ఫోకస్ పెట్టింది రాష్ట్ర ప్రభుత్వం
- అత్యంత కీలకమైన పోలీస్ శాఖలో భారీ ప్రక్షాళనకు రెడీ
- కొత్త టీంను సెట్ చేసుకోవడంపై సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే కసరత్తులు పూర్తి
- కీలక బాధ్యతల్లో కొత్త అధికారులను నియమించడంతో పాటు ఇప్పటికే ఒకటికి మించి అదనపు పోస్టులతో పని భారం ఉన్న అధికారులకు ఉపశమనం కలిగించే ఛాన్స్
- ఒకట్రెండు రోజుల్లోనే ఉత్తర్వులు జారీ చేసే అవకాశం



హైదరాబాద్

తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగియడంతో తిరిగి ప్రజాపాలనపై ఫోకస్ పెట్టింది రాష్ట్ర ప్రభుత్వం. ఇందులో భాగంగానే అత్యంత కీలకమైన పోలీస్ శాఖలో భారీ ప్రక్షాళనకు రెడీ అవుతున్నట్టు తెలుస్తోంది. కొత్త టీంను సెట్ చేసుకోవడంపై సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే కసరత్తులు పూర్తి చేశారని, ఐపీఎస్ అధికారుల బదిలీలు పెద్ద సంఖ్యలో జరిగే ఛాన్స్ ఉన్నట్టు టాక్. డీజీపీ, పలువురు పోలీస్ కమిషనర్లు సహా పలు కీలక పోస్టుల్లో ఉన్న అధికారులకు స్థాన చలనం తప్పదనే చర్చ జోరుగా నడుస్తోంది. కీలక బాధ్యతల్లో కొత్త అధికారులను నియమించడంతో పాటు ఇప్పటికే ఒకటికి మించి అదనపు పోస్టులతో పని భారం ఉన్న అధికారులకు ఉపశమనం కలిగించే ఛాన్స్ ఉంది. ఈ మేరకు ఒకట్రెండు రోజుల్లోనే ఉత్తర్వులు జారీ చేసే చాన్స్ ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం డీజీపీ హెచ్‌ఓపీఎఫ్ హెడ్ఆఫ్ పోలీస్ ఫోర్స్‌గా ఉన్న రవిగుప్తా స్థానంలో కొత్త డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారులు సీవీ ఆనంద్, శివధర్‌రెడ్డి, - మిగతా3లో



## లోక్‌సభ ఎన్నికల ఫలితాలు తప్పుగా అంచనా వేశాం..

- తమ అంచనాలు 20 శాతం తప్పుగా ఉన్నాయి
- బీజేపీకి సీట్లు తగ్గినప్పటికీ సాధారణ ఓటరు సెంటిమెంట్ చాలా వరకు ఖచ్చితంగా ఉంది
- బీజేపీ ఓటు శాతం స్థిరంగా ఉంది
- ఒప్పుకున్న ప్రశాంత్ కిషోర్

# కేటీఆర్ రాజీనామా?



- రాష్ట్ర సాధన కోసం పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్.
- పార్టీ అధినేత సకల జనులను ఏకం చేసి స్వరాష్ట్ర ఉద్యమం
- ఉద్యమ నేతగా గులాబీ పార్టీకి తెలంగాణ ప్రజలు పట్టం కట్టారు
- అక్కడి నుంచి గులాబీ నేతల్లో స్వార్థం మొదలైంది
- తెలంగాణ ప్రయోజనాల కన్నా కుటుంబ ప్రయోజనాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు.
- తాజాగా లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మరింత దారుణంగా
- కేటీఆర్ నిర్లక్ష్య వైఖరి, ఒంటెత్తు పోకడలే ఎన్నికల్లో పార్టీ తీవ్ర పరాభవం

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్. స్వరాష్ట్ర సాధన కోసం 24 ఏళ్ల క్రితం పుట్టిన ఈ పార్టీ.. లక్ష్యాన్ని చేరుకుంది. పార్టీ అధినేత సకల జనులను ఏకం చేసి స్వరాష్ట్ర ఉద్యమం సాగించారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి తెలంగాణ సాధించారు. 2014లో స్వరాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో పోటీ చేశారు. ఉద్యమ నేతగా గులాబీ పార్టీకి తెలంగాణ ప్రజలు పట్టం కట్టారు. అక్కడి నుంచి గులాబీ నేతల్లో స్వార్థం మొదలైంది. తెలంగాణ ప్రయోజనాల కన్నా కుటుంబ ప్రయోజనాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. అయినా 2018 ముందస్తు ఎన్నికల్లోనూ మరోమారు అవకాశం ఇచ్చారు. ఆ తర్వాత కేసీఆర్, కేటీఆర్ అహంకారం తలకెక్కింది. దీంతో ఆ పార్టీకి మరో మారు అవకాశం ఇవ్వొద్దని యావత్ తెలంగాణ నిర్ణయించుకుంది2023 - మిగతా3లో

# ఆరోగ్యశ్రీలో మరికొన్ని వ్యాదులు

- అదనంగా 65 కొత్త చికిత్స విధానాలు అమలు
- వీటితో పాటు ఇప్పటివరకు అందుబాటులో ఉన్న వాటిలో 1,375 విధానాలకు ప్యాకేజీ ధరలను పెంచుతూ నిర్ణయం
- వీటికి సంబంధించి రూ.497.29 కోట్లను విడుదల ఆదేశాలు జారీ


హైదరాబాద్

ఆరోగ్య శ్రీ పథకంలో అదనంగా 65 అధునాతన చికిత్స విధానాలను రాష్ట్ర ప్రభుత్వం చేర్చింది. వీటితో పాటు ఇప్పటివరకు అందుబాటులో ఉన్న వాటిలో 1,375 విధానాలకు ప్యాకేజీ ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. వీటికి సంబంధించి రూ.497.29 కోట్లను విడుదల చేస్తూ ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. ఆరోగ్య శ్రీ పథకం కింద కొత్త చికిత్స విధానాలు, ప్రస్తుత పథకాల ఆర్థిక సవరణకు - మిగతా3లో

అందరికి వైద్యం
రాజీవ్ ఆరోగ్యశ్రీ

## చేప మందు కోసం పోటెత్తిన ప్రజలు

- ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప ప్రసాదం పంపిణీ ప్రారంభం
- భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో నాంపల్లి పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జాం
- బత్తిని సోదరులు అందించే చేప ప్రసాదం రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా ప్రాచుర్యం



# దేశ రాజకీయాల్లో కొత్త ట్విస్ట్

బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు ఇండియా కూటమి ప్రధాని పదవిని ఆఫర్ చేసినట్లుగా జేడీయూ వర్గాలు వెల్లడించాయి. అయితే నితీశ్ కుమార్ ఈ ఆఫర్‌ను తిరస్కరించినట్లుగా తెలుస్తోంది. ఆ పార్టీ నేత కేసీ త్యాగి ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి మెజారిటీ మార్క్(272)ని దాటి 293 స్థానాలు గెలుపొందడంతో.. మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమవుతోంది. నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేసేందుకు ముహూర్తమూ ఖరారైంది. ఇలాంటి తరుణంలో.. దేశ రాజకీయాలను కుదుపు కుదిపేసేలా ఓ రాజకీయ నేత సంచలన ప్రకటన చేశారు. బిహార్ సీఎం, జనతాదళ్ (యు) అధ్యక్షుడు నితీశ్ కుమార్‌కు ప్రధాని పదవి ఆఫర్ చేశారంటూ కుండబద్దలు కొట్టారు. ఆ పార్టీకి చెందిన కేసీ త్యాగి ఓ ఇంటర్వ్యూలో ఈ బాంబ్ పేల్చారు.



నితీశ్ కుమార్‌కు ప్రధాని పదవి ఆఫర్ వచ్చిందని, ఆయన మాత్రం తిరస్కరించారని తెలిపారు. ఈ విషయమై ఇండియా కూటమి నేతలు... తమ అధినేతను కలిసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కానీ ప్రస్తుతం తాము ఎన్డీయేలో ఉన్నామని స్పష్టం చేశారు. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ కూడా స్పందించింది. త్యాగి వ్యాఖ్యలను ఖండించింది. నితీశ్‌ను ప్రధానిగా చేసేందుకు ఇండి కూటమి సంప్రదించడంపై తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపింది. ఈ విషయం గురించి కేవలం ఆయనకు మాత్రమే తెలుసునని చురక అంటించింది.

**నితీశ్ కుమార్‌కు ప్రధాని ఆఫర్**

ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేసీ త్యాగి మాట్లాడుతూ.. "నితీశ్ కుమార్‌కు ఇండియా కూటమి నుంచి ప్రధాని పదవి ఆఫర్ వచ్చింది. నితీశ్‌ను ఈ కూటమికి కన్వీనర్ అయ్యేందుకు ఎవరైతే అనుమతించలేదో.. ఆ వ్యక్తుల నుంచే ఈ ఆఫర్ ఆయనకు వచ్చింది. కానీ తాను ఎన్డీఏ కూటమిలోనే కొనసాగుతానని చెప్పి, ఆ ఆఫర్‌ని నితీశ్ తిరస్కరించారు" అని చెప్పుకొచ్చారు. మరి, ఈ ఆఫర్ చేసిన నాయకులు ఎవరని ప్రశ్నించగా.. అందుకు జవాబు ఇచ్చేందుకు త్యాగి నిరాకరించారు. ప్రధాని పదవి ఆఫర్‌తో కొందరు నాయకులు నేరుగా నితీశ్‌ని సంప్రదించాలని అనుకున్నారని చెప్పారు కానీ, వారి పేర్లు బయటపెట్టలేదు. తాము ఇండియా కూటమిని విడిచిపెట్టి ఎన్డీఏలో చేరామని, ఇకపై వెనుదిరిగి చూసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

**కాంగ్రెస్ పార్టీ క్లారిటీ**

అయితే.. కేసీ త్యాగి వాదనల్ని మాత్రం కాంగ్రెస్ తోసిపుచ్చింది. ఆయన చేసిన వ్యాఖ్యల్లో ఏమాత్రం వాస్తవం లేదని, నితీశ్‌కు ఎవరూ పీఎం పదవిని ఆఫర్ చేయలేదని క్లారిటీ ఇచ్చింది. ఈ అంశంపై కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ.. "కేసీ త్యాగి చేసిన వ్యాఖ్యల్లో వాస్తవం లేదు. అలాంటి సమాచారం మాకు అందలేదు. నాకు తెలిసి.. కేసీ త్యాగి ఒక్కరికే ఈ విషయం తెలిసి ఉంటుంది" అంటూ సైలెంట్‌గా కౌంటర్ వేశారు. ఎన్నికల ఫలితాలు వచ్చాక తాము నితీశ్‌కుమార్‌ని సంప్రదించలేదని, ఇదొక అసత్య ప్రచారమని ఆయన ఖరాఖండీగా తేల్చి చెప్పారు.

# అన్నామలైకి కేంద్రమంత్రి పదవి?

## అదేగాని జరిగితే ఇక రాష్ట్రంలో అధికారపార్టీకి...

**చెన్నై:** రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓటు బ్యాంక్ పెంచిన ఉత్సాహంతో ఢిల్లీ వెళ్ళిన ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కేంద్ర మంత్రివర్గంలో చోటు సంపాదించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పటికే బీజేపీ జాతీయ నాయకులతో ఆయన మంతనాలు జరుపుతున్నారు. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘోర పరాజయాన్ని చవిచూసినా ఓటు బ్యాంక్ పెరిగి పార్టీ ప్రతిష్ఠ ఉన్నతస్థితికి చేరిందని అన్నామలై చెబుతున్నారు. గతంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసినవారికి మంత్రి పదవులు, గవర్నర్ పదవులు ఇచ్చినట్లే ఈసారి పార్టీ అధిష్టానం తనకు తప్పకుం డా మంత్రి పదవి కట్టబెడుతుందని ఆశపడుతున్నారు. గతంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసిన ఇలా గణేషన్, సీపీ రాధాకృష్ణన్, తమిళిసైలను గవర్నర్లుగా నియమించిందని, తనకు ముందు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన ఎల్.మురుగన్‌కు కేంద్ర మంత్రి వర్గంలో స్థానం కల్పించారని, ఆ వరుసలోనే తనకు కూడా కేంద్ర మంత్రిపదవి తప్పకుండా లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా తాను పార్టీ పగ్గాలు స్వీకరించినప్పటి నుండే పార్టీ ప్రతిష్ట క్రమంగా పెరుగుతూ వచ్చిందని, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఓటు బ్యాంక్ 11.5 శాతానికి పెరిగిందని ఆయన చెబుతున్నారు. అన్నామలై ఇమేజ్ వల్ల పార్టీకి ఓటు బ్యాంక్ పెరుగలేదని, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల వ్యక్తిగత కీర్తిని చూసే ఓటర్లు ఓటువేశారని కొన్ని వర్గాలు చెబుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ తనకు కేంద్ర మంత్రి వర్గంలో తప్పకుండా స్థానం లభిస్తుందని అన్నామలై ధీమా వ్యక్తం చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా బీజేపీ తరపున పోటీ చేసిన అభ్యర్థుల వివరాలన్నీ మోదీ వద్ద ఉన్నాయని, వాటిని పరిశీలించినమీదటే ఎవరికి ఏ మంత్రిత్వ శాఖను కేటాయించాలనే విషయంపై నిర్ణయం తీసుకుంటారని స్థానిక నాయకులు చెబుతున్నారు. ఏదీ ఏమైనప్పటికీ అన్నామలై ఢిల్లీ తిష్టవేసి మంత్రి పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆ ప్రయత్నాలు ఫలిస్తాయో లేదో ఒకటి రెండు రోజుల తర్వాతే తెలుస్తుంది.



## తగ్గిన వందే భారత్ రైళ్ల వేగం..
## మూడేండ్లలో ఎంత తగ్గిందంటే..!



కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన వందే భారత్ రైళ్లకు విశేష స్పందన లభిస్తోంది. అందుకే దేశవ్యాప్తంగా వందేభారత్ రైళ్ల సంఖ్యను గణనీయంగా పెంచుతున్నారు. తక్కువ సమయంలోనే సుదూర ప్రయాణాలకు వెళ్లడానికి వెసులుబాటు ఉండటంతో జనాలు కూడా వీటిని ఆదరిస్తున్నారు. అయితే వందే భారత్ రైళ్ల సంఖ్య ఎంతగా పెరుగుతుందో.. వాటి వేగం అంతలా తగ్గిపోతుందంట! గడిచిన మూడేండ్లలో వందే భారత్ రైళ్లు ప్రయాణించే వేగం గంటకు 84.48 కిలోమీటర్ల నుంచి 76.25 కిలోమీటర్లకు పడిపోయింది. ఈ విషయాన్ని సమాచార హక్కు చట్టం కింద ఓ వ్యక్తి అడిగిన ప్రశ్నకు సమాధానంగా రైల్వే శాఖ వెల్లడించింది. వందేభారత్ రైళ్లను 2019 ఫిబ్రవరి 15వ తేదీన తొలిసారిగా ప్రారంభించారు. గంటలకు 160 కిలోమీటర్ల వేగతంతో ప్రయాణించేలా వీటిని అత్యాధునిక టెక్నాలజీతో పునరుద్ధరించారు. కానీ వందేభారత్ రైళ్ల సగటు వేగం 2020-21లో 84.48 కిలోమీటర్లు ఉండగా.. 2022-2 నాటికి ఆ వేగం 81.38 కిలోమీటర్లకు, 2023-24 నాటికి 76.26 కిలోమీటర్లకు పడిపోయిందని రైల్వే శాఖ వెల్లడించింది. కేవలం వందే భారత్ రైళ్లు మాత్రమే కాదని, వివిధ మార్గాల్లో ట్రాక్ పునరుద్ధరణ, స్టేషన్ల నవీకరణ కారణంగా సాధారణ రైళ్ల వేగం కూడా తగ్గిందని పేర్కొంది. మధ్యప్రదేశ్‌కు చెందిన చంద్రశేఖర్ గౌర్ చేసిన ఆర్టీఐ దరఖాస్తుకు రైల్వే అధికారులు ఈ మేరకు సమాధానమిచ్చారు.

# ప్రతిపక్ష నేతగా బాధ్యతలు తీసుకోండి



రాహుల్‌గాంధీయే లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ కోరింది. ఇవాళ ఢిల్లీలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సీడబ్ల్యూసీ సమావేశం ముగిసిన అనంతరం కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, పార్టీ అధికార ప్రతినిధి జైరామ్ రమేశ్ మీడియాతో మాట్లాడారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా వ్యవ హరించాలని సీడబ్ల్యూసీ సమావేశంలో తాము ఏకగ్రీవంగా ప్రతిపాదన చేశామని కేసీ వేణుగోపాల్ చెప్పారు. తమ ప్రతిపాదనపై ఆలోచించి నిర్ణయం తీసుకుంటానని రాహుల్‌గాంధీ చెప్పారని ఆయన తెలిపారు. సాధ్యమైనంత త్వరలో తన నిర్ణయాన్ని వెల్లడిస్తానని చెప్పారని అన్నారు. రెండు చోట్ల గెలిచిన రాహుల్‌గాంధీ ఏ స్థానానికి రాజీనామా చేస్తారని మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ, కేరళలోని వాయనాడ్ నుంచి గెలిచిన రాహుల్‌గాంధీ రెండింట్లో ఏదో ఒక స్థానాన్ని వదులుకునేందుకు ఈ నెల 15 వరకు గడువు ఉన్నదని, కానీ ఈ మూడు నాలుగు రోజుల్లో ఆయన నిర్ణయం తీసుకుంటారని కేసీ వేణుగోపాల్ చెప్పారు. నితీశ్ కుమార్ ఇండియా కూటమి వైపు వస్తే పీఎం పదవి ఇస్తామని ఆఫర్ చేసినట్లు కేసీ త్యాగీ చెబుతున్నారుగా అన్న ప్రశ్నకు.. ఆ విషయం తనకు తెలియదని అన్నారు.

# వయనాడ్‌ను వదులుకోనున్న రాహుల్ గాంధీ?

**వయనాడ్‌లోనే కొనసాగాలని కేరళ కాంగ్రెస్ నేతల విజ్ఞప్తి**

**యూపీలో పార్టీ అభివృద్ధిపై దృష్టి సారించాలన్న అధిష్ఠానం**

**అధిష్ఠానం సూచనల మేరకు ఓకే చెప్పిన కేరళ కాంగ్రెస్ నేతలు**

**వయనాడ్ నుంచి కేరళ సీనియర్ నేతను పోటీ చేయించాలని భావిస్తున్న కాంగ్రెస్**



లోక్ సభ ఎన్నికలలో యూపీలోని రాయ్‌బరేలీ, కేరళలోని వయనాడ్ నుంచి విజయం సాధించిన రాహుల్ గాంధీ రెండో సీటును వదులుకోనున్నట్లుగా తెలుస్తోంది. యూపీలో పార్టీ అభివృద్ధిపై దృష్టి సారించడం కోసం ఈ సీటును అట్టిపెట్టుకోవాలని భావిస్తున్నారు. వయనాడ్ నుంచి రెండోసారి గెలిపించినందున ఈ సీట్లోనే కొనసాగాలని కేరళ కాంగ్రెస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. అయితే యూపీపై దృష్టి సారించాల్సి ఉందన్న అధిష్ఠానం సూచనల మేరకు కేరళ కాంగ్రెస్ నాయకులు కూడా ఆ తర్వాత అందుకు అంగీకరించారని తెలుస్తోంది. శనివారం జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ఈ అంశంపై చర్చించినట్లుగా చెబుతున్నారు. రెండు నియోజకవర్గాల్లో పర్యటించిన తర్వాత మాత్రమే తుది ప్రకటన వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు, రాహుల్ గాంధీ వదులుకుంటే కనుక, అదే వయనాడ్ నుంచి ప్రియాంకా గాంధీని పోటీ చేయించాలన్న విజ్ఞప్తిని కూడా గాంధీ కుటుంబం తిరస్కరించిందని చెబుతున్నారు. కేరళకు చెందిన సీనియర్ నేతను ఇక్కడి నుంచి బరిలోకి దించాలని భావిస్తున్నారు.

## లోక్‌సభ ఎన్నికల ఫలితాలు తప్పుగా అంచనా వేశాం



**న్యూఢిల్లీ:** రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ఎట్టకేలకు తన మౌనాన్ని వీడారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలను తప్పుగా అంచనా వేసినట్లు ఒప్పుకున్నారు. తమ అంచనాలు 20 శాతం తప్పుగా ఉన్నాయని తెలిపారు. అయినప్పటికీ బీజేపీ ఓటు శాతం స్థిరంగా ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి సుమారు 300 సీట్లు వస్తాయని, సొంత బలంతోనే మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని పోలింగ్‌కు ముందు ప్రశాంత్ కిషోర్ తెలిపారు. అయితే ఫలితాల్లో బీజేపీకి 240 సీట్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఒక టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రశాంత్ కిషోర్ మాట్లాడారు. 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై తన అంచనాలు తప్పని అంగీకరించారు. 'బీజేపీకి దాదాపు 300 సీట్లు వస్తాయని ఊహించాం. కానీ 240 సీట్లు వచ్చాయి. సుమారు 20 శాతం తప్పుగా అంచనా వేశాం' అని అన్నారు. కాగా, లోక్‌సభ ఎన్నికల్లో తన అంచనాలను ప్రశాంత్ కిషోర్ సమర్థించుకున్నారు. బీజేపీకి సీట్లు తగ్గినప్పటికీ సాధారణ ఓటరు సెంటిమెంట్ చాలా వరకు ఖచ్చితంగా ఉందని తెలిపారు. బీజేపీ ఓటు శాతం స్థిరంగా ఉందని చెప్పారు. 'బీజేపీ పట్ల ప్రజల్లో కొంత అసంతృప్తి, కోపం ఉంది. కానీ మోదీ పట్ల విస్తృతమైన శత్రుత్వం లేదు' అని అన్నారు. ప్రధాని మోదీ సంకీర్ణ ప్రభుత్వాన్ని సమర్థంగా నడపగలరని తెలిపారు. అలాగే మరో 20 నుంచి 30 ఏళ్ల వరకు దేశ రాజకీయాల్లో బీజేపీ ఆధిపత్యంలో ఉంటుందన్నారు. మరోవైపు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 99 సీట్లు సాధించినప్పటికీ ఆ పార్టీ పనితీరు అంతగా మెరుగుపడలేదని ప్రశాంత్ కిషోర్ విమర్శించారు. కాంగ్రెస్‌కు లేదా రాహుల్ గాంధీకి ఈ ఫలితాలు పునర్జీవంగా భావించకూడదని అన్నారు. 'కాంగ్రెస్ చరిత్రలో ఇది మూడో చెత్త ప్రదర్శన. గతం కంటే ఆ పార్టీ ఎక్కువ సీట్లు సాధించింది. వారికి అవకాశాలు ఉన్నాయని ప్రస్తుత పరిణామాలు సూచిస్తున్నాయి. కానీ పెద్దగా పునరాగమనం చెందలేదు' అని అన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..
## ఏడుగురు నక్సలైట్లు హతం




**నారాయణ్‌పుర్:** ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ తూటా పేలింది. పోలీసులకు, నక్సలైట్లకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఏడుగురు నక్సలైట్లు ప్రాణాలు కోల్పోయారు. నారాయణ్ పుర్ - దంతేవాడ జిల్లాల సరిహద్దులోని గోబెల్ అటవీ ప్రాంతంలో ఇది జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మావోయిస్టుల కదలికల సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్‌తో కలిసి జాయింట్ ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో ఎదురుపడ్డ నక్సలైట్లపై కాల్పులు జరిపారు. మృతులను నారాయణ్‌పుర్, దంతేవాడ, బస్తర్, కొండగావ్ జిల్లాలకు చెందిన వారిగా గుర్తించారు.

## నిజం ఒప్పేసుకున్నారు..
## అక్కడ ఓటమికి బాధ్యత నాదే..



**బెంగళూరు:** బెంగళూరు గ్రామీణ నియోజకవర్గం ఓటమికి వ్యక్తిగతంగా తనదే బాధ్యత అని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. నగరంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... బెంగళూరు గ్రామీణ నుంచి తన తమ్ముడు డీకే సురేశ్ ఓటమికి తన వ్యక్తిగత బాధ్యతగా భావిస్తున్నా అన్నారు. ఓటమి నుంచి కోలుకోవాల్సి ఉందన్నారు. ఓడినంత మాత్రాన మౌనంగా ఉండేది లేదన్నారు. కాంగ్రెస్ వ్యతిరేక ఓట్లు ఒక్కటవుతాయని భావించా అన్నారు. మైనారిటీల ఓట్లు మినహా బీజేపీ, జేడీఎస కార్యకర్తల ఓట్లన్నీ వస్తాయని భావించామన్నారు. ఈ స్థాయిలో ఫలితం ఉంటుందని ఊహించలేదన్నారు. చెన్నపట్టణ ఎమ్మెల్యే స్థానానికి జరిగే ఉప ఎన్నికల్లో డీకే సురేశ్ పోటీ చేసే విషయం ఇంకా ప్రస్తావనకు రాలేదన్నారు. ఇప్పుడిప్పుడే ఓటమి నుంచి కోలుకుంటున్నామని పేర్కొన్నారు. ఓడిపోయామని ఇంట్లో కూర్చునేది లేదని, తనను నమ్మిన కార్యకర్తలు, ప్రజలకు శక్తిని నింపేలా పనిచేస్తా అన్నారు. కార్యకర్తల రక్షణకు ఏం చేయాలో పరిశీలిస్తామన్నారు. ఎంతోమంది పెద్దనాయకులే ఓడిపోయిన సందర్భాలు ఉన్నాయన్నారు. 14 స్థానాల్లో విజయం సాధిస్తామని భావించామన్నారు. ఒక్కస్థానం నుంచి 9 స్థానాలకు పెరిగామన్నారు. ఇంకా ఎక్కువ స్థానాలు లక్ష్యంగా ఉన్నా సాధ్యం కాలేదన్నారు. తన నియోజకవర్గ పరిధిలో డాక్టర్ సీఎన్ మంజునాథ్ గెలుపొందారని, వ్యక్తిగతంగా అభినందిస్తున్నా అన్నారు. పార్టీ కంటే అక్కడ వ్యక్తి గెలిచారని పేర్కొన్నారు. ఇంత తేడా ఊహించలేదన్నారు. డీకే సురేశ్ బాగా పనిచేశారని, ప్రభుత్వంపై వ్యతిరేకత లేదన్నారు. డాక్టర్ మంజునాథ్‌కు ఒక అవకాశం ఇవ్వాలని గెలిపించారని పేర్కొన్నారు. కనకపురలో 60వేల మెజారిటీ వస్తుందని భావించామని కానీ సాధ్యం కాలేదన్నారు. ఫలితాల ద్వారా ప్రజలు ఇచ్చిన సందేశాన్ని అంగీకరిస్తానని తెలిపారు

## మోదీ ప్రమాణ స్వీకారోత్సవానికి
## రజనీకాంత్‌కు ఆహ్వానం



**చెన్నై:** మూడోసారి ప్రధాని నరేంద్రమోదీ ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొనమంటూ తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు ఆహ్వానం అందింది. దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ ఈ నెల 9న మూడోసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆ ప్రమాణ స్వీకారోత్సవానికి దేశవిదేశాలకు చెందిన ప్రముఖులు అనేక మందిని ఆహ్వానిస్తున్నారు. ఆ మేరకు ఢిల్లీలో జరిగే ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని పీఎంవో నుంచి రజనీకాంత్‌కు ఆహ్వానం వచ్చినట్టు సమాచారం.

# అస్తమించిన ఉషాకిరణం

**హైదరాబాద్ :** ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు కన్నుమూశారు. మూడు రోజుల క్రితం శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడంతో ఆయన్ని ఆసుపత్రిలో చేర్చారు. పరీక్షలు చేసిన వైద్యులు స్టంట్ వేయాలని సూచించారు. వైద్యులు చెప్పినట్టుగా స్టంట్ వేసిన తర్వాత ఆయన పరిస్థితి కాస్త క్రిటికల్ అయింది. ఈ నెల 5న ఆయనకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడంతో పరీక్షించిన వైద్యులు స్టెంట్ అమర్చారు. స్టెంట్ వేసిన తర్వాత ఆయన ఆరోగ్య పరిస్థితి కొంచెం క్రిటికల్‌గా మారడంతో ఆసుపత్రిలో చేర్పించారు. ఇక 88 ఏళ్ల రామోజీరావు గత కొంతకాలంగా పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. గతంలో కూడా ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందారు.

కాగా, రామోజీరావు మీడియాతోపాటు అనేక వ్యాపారాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈనాడు సంస్థలు, రామోజీ ఫిల్మ్ సిటీ, మార్గదర్శి చిట్‌ఫండ్స్, ప్రియా ఫుడ్స్, ఈటీవీ వంటి వ్యాపార సామ్రాజ్యాన్ని రామోజీరావు నడిపిస్తున్నారు. తెలుగు మీడియాలో ప్రధానమైన ఈనాడు సంస్థ ఆయన ఆధ్వర్యంలోనే కొనసాగుతున్న విషయం విదితమే.

ఈ రోజు తెల్లవారుజామున 4 గంటల 50 నిమిషాలకు ఆయన కన్నుమూశారు. రామోజీ ఫిల్మ్‌సిటీలోని నివాసానికి ఆయన పార్థివ దేహాన్ని తరలించనున్నారు.ప్రస్తుతం రామోజీరావు వయస్సు 88 ఏళ్లు. వ్యాపార దిగ్గజంగా ఆయనకు గొప్ప పేరుంది. మీడియాతో పాటు అనేక వ్యాపారాల్లో రాటుదేలారు రామోజీరావు. ఈనాడు సంస్థలు, మార్గదర్శి చిట్‌ఫండ్స్, ప్రియా ఫుడ్స్ వంటి వ్యాపారాలు నెలకొల్పి ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్నారు. అంతేగాక రామోజీ ఫిల్మ్ సిటీ ఏర్పాటు చేసి హైదరాబాద్, సినీ పరిశ్రమ అభివృద్ధిలో భాగమయ్యారు రామోజీరావు.రామోజీరావు చిన్న రైతు కుటుంబంలో 1936 నవంబర్ 16న జన్మించారు. వెంకటసుబ్బారావు, వెంకటసుబ్బమ్మల పుత్రవాత్సల్యమే రామోజీరావు. చిన్నతనం నుంచే ఆయనకు సాహిత్యంపట్ల అభిరుచి అబ్బింది. ఇంట్లో తల్లికి చేదోడు వాదోడుగా ఉంటూ గుడివాడలో బీఎస్సీ గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. తనకు తెలిసిన పరిచయస్తులతో అడ్వర్టైజింగ్ రంగంపై దృష్టిపెట్టారు.



ఆ తరువాత ఢిల్లీలోని ఒక ప్రముఖ ప్రకటన రంగ సంస్థలో ఆర్టిస్టుగా జీవిత ప్రస్థానాన్ని సాగించి అంచెలంచెలుగా ఎదిగారు. 3 సంవత్సరాలు అలా పనిచేసి హైదరాబాద్ వచ్చి వ్యాపారం చేసేందుకు సంకల్పించారు.

**జీవన ప్రస్థానం ఇలా..**

1962 మార్గదర్శి చిట్స్ ఏర్పాటు చేశారు
1965 కిరణ్ యాడ్స్ అడ్వర్టైజింగ్ ఏజెన్సీ ప్రారంభం
1967 వసుంధర ఫెర్టిలైజర్స్ వ్యాపారం
1969 అన్నదాత పత్రిక
1970 ఇమేజెస్ అవుట్ డోర్ అడ్వర్టైజ్?మెంట్ ఏజెన్సీ
1971 డాల్ఫిన్ హూటల్స్ ప్రారంభం
1972 ఈనాడు వార్తా పత్రిక

**మీడియా రంగంలో..**

ఆ తరువాత ప్రియా ఫుడ్స్, ఉషాకిరణ్ మూవీస్, రామోజీ ఫిల్మ్ సిటీ, కళాంజలి షోరూం, ఈటీవీ2, ఈటీవీ కన్నడ, ఈటీవీ మరాఠీ, ఈటీవీ ఉర్దూ, ఈటీవీ బెంగాలి, ఈటీవీ ఒరియా, ఈటీవీ గుజరాతీ, ఈటీవీ బీహార్, ఈటీవీ2, ఈటీవీ భారత్ ఇలా అనేక రంగాల్లో తనదైన ప్రతిభను కనబరిచారు.

**సినిమా రంగంలో నిర్మించిన చిత్రాలు..**

శ్రీవారికి ప్రేమలేఖలు, మయూరి, మౌన పోరాటం ప్రతిఘటన మెకానిక్ మామయ్య ఇష్టం నువ్వే కావాలి ఆనందం ఆకాశ వీధిలో నిన్ను చూడాలని వీధి నచ్చావులే నిన్ను కలిశాక

**అవార్డులు, సన్మానాలు..**

ఆంధ్ర, శ్రీ వెంకటేశ్వర, శ్రీశ్రీ రవిశంకర్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ యుధవీర్ అవార్డు బి.డి. గోయెంకా అవార్డు పద్మ విభూషణ్

**రామోజీ.. రాజీపడరు!**

'రామోజీరావు మరణ వార్తను జీర్ణించుకోలేకపోతున్నాను. రామోజీరావు మరణం మీడియా, సినీ రంగానికి తీరని లోటు. సమాజహితం కోసమే అనునిత్యం రామోజీరావు కష్టపడ్డారు. తెలుగుజాతి కోసం అహర్నిశలు పనిచేశారు. రామోజీరావు వ్యక్తి కాదు.. ఒక వ్యవస్థ. రామోజీరావు కారణ జన్ములు.. యుగపురుషుడు. చిత్రపరిశ్రమకు రామోజీరావు ఎనలేని సేవలు చేశారు. రామోజీరావు నిర్మించిన వ్యవస్థలు శాశ్వతం. తెలుగుజాతిని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేశారు.. రాష్ట్రాభివృద్ధికి ఆయన ఇచ్చిన స్ఫూర్తితో ముందుకెళ్తాం. ఈనాడు ద్వారా ప్రజల్ని చైతన్యవంతుల్ని, విజ్ఞానవంతుల్ని చేశారు. ఏ పనిలోనూ రామోజీ రాజీపడేవారు కాదు. రామోజీరావు మొదట్నుంచీ ప్రజల పక్షాన నిలబడిన గొప్ప వ్యక్తి. రామోజీరావు ఆత్మకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను. రామోజీ కుటుంబ సభ్యులు, ఉద్యోగులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని చంద్రబాబు చెప్పుకొచ్చారు.

**ఆదివారం అంత్యక్రియలు!**

రామోజీరావు అంత్యక్రియలు ఆదివారం నిర్వహించనున్నారు. ఉదయం 9 – 10 గంటల మధ్య అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. మరోవైపు ఫిలింసిటీలోని ఆయన నివాసంలో రామోజీరావు పార్థివ దేహాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు రామోజీ ఫిల్మ్ సిటీకి చేరుకుని.. రామోజీరావు పార్థీవదేహానికి నివాళులు అర్పిస్తున్నారు.

## 'నీట్' అవకతవకలపై విచారణ జరిపించాలని

# ఎన్డీయే ప్రభుత్వానికి కేటీఆర్ డిమాండ్

**లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన నీట్ అంశంపై స్పందించాలని సూచన**

**నీట్ ఎగ్జామ్ వ్యవహారాలు చూస్తుంటే అవకతవకలు జరిగినట్లుగా అర్థమవుతోందన్న కేటీఆర్**

**67 మంది విద్యార్థులకు 720కి 720 మార్కులు ఎలా వచ్చాయని ప్రశ్న**

**చాలామంది విద్యార్థులకు 718, 719 మార్కులు ఎలా వచ్చాయో చెప్పాలన్న కేటీఆర్**

కేంద్రంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్న ఎన్డీయే ఎదుట ఎన్నో సవాళ్ళున్నాయని... కానీ లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన కీలకమైన 'నీట్' అంశంపై వెంటనే స్పందించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. లక్షలాది మంది వైద్య విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేసే నీట్ ఎగ్జామ్‌కు సంబంధించి కొన్ని వ్యవహారాలు చూస్తుంటే కచ్చితంగా అవకతవకలు జరిగినట్లు స్పష్టంగా అర్థమవుతోందన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ సంవత్సరం నీట్ పరీక్షల్లో 67 మంది విద్యార్థులు 720కి 720 మార్కులతో ఫస్ట్ ర్యాంక్ సాధించటం అనుమానాలకు తావిస్తోందన్నారు. దీనికి తోడు ఈసారి చాలామంది విద్యార్థులు 718, 719 మార్కులు సాధించారని తెలిపారు. నీట్‌లో (o4, -1) మార్కింగ్ విధానం ఉంటుందని... ఈ లెక్కన 718, 719 మార్కులు రావడం సాధ్యమయ్యే పని కాదన్నారు. దీని గురించి ప్రశ్నిస్తే 'గ్రేస్ మార్కులు' ఇచ్చామని చెబుతున్నారని... కొంతమంది విద్యార్థులకు 100 వరకు గ్రేస్ మార్కులు ఇచ్చినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. గ్రేస్ మార్కుల కోసం ఏ విధానం అవలంబించారన్నది చెప్పకపోవటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. నీట్ ఫలితాలను ప్రీపోన్ చేసి ఎన్నికల ఫలితాల రోజే హడావుడిగా విడుదల చేయటం కూడా ఎన్నో అనుమానాలకు తావిస్తోందన్నారు. కొత్తగా ఏర్పడిన ఎన్డీయే సర్కార్ రానున్న రోజుల్లో ఇలాంటి సమస్యలకు సంబంధించి చాలా సవాళ్లను ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు. అయితే నీట్ ఎగ్జామ్ విషయంలో బీఆర్ఎస్ తరపున పలు పశ్నలతో పాటు కొన్ని డిమాండ్లను కేంద్రం ముందు ఉంచుతున్నట్లు తెలిపారు.



**కొన్ని ప్రశ్నలు/డిమాండ్లు:**

1) గత ఐదేళ్లలో తెలంగాణా నుండి ఏ విద్యార్థి కూడా మొదటిసారిగా టాప్ 5లో లేరు. దీనికి కారణం వివిధ అక్రమాలు అని భావిస్తున్నాము.

2) గ్రేస్ మార్కుల కేటాయింపు కోసం అనుసరించిన ప్రక్రియను బహిర్గతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము. 1,500 మంది విద్యార్థులతో కూడిన ఎంపిక చేసిన సమూహానికి మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరికీ ప్రయోజనం చేకూర్చే ప్రామాణిక పద్ధతి ఉండాలి.

3) మేము న్యాయం కోరుతున్నాం... విద్యార్థులందరికీ... వారి కుటుంబాలకు న్యాయం జరిగేలా... క్షుణ్ణంగా దర్యాప్తు చేయడానికి ఉన్నతస్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని అభ్యర్థిస్తున్నామని పేర్కొన్నారు.

## ఆదిత్యానాథ్ దాస్ నియామకం తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు : నిరంజన్ రెడ్డి

**హైదరాబాద్ :** తెలంగాణ నీటి పారుదల శాఖ సలహాదారు పదవి నుంచి ఆదిత్యానాథ్ దాస్‌ను తొలగించాలని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదిత్యానాథ్ దాస్ నియామకం తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అని పేర్కొన్నారు. చంద్రబాబు ఆదేశిస్తున్నాడు.. శిష్యుడు రేవంత్ పాటిస్తున్నాడని తెలిపారు. ప్రమాణ స్వీకారానికి ముందే తెలంగాణపై చంద్రబాబు పెత్తనం మొదలైందనడానికి ఈ నియామకమే నిదర్శనం అని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసిన తెలంగాణకు రుణపడి ఉంటాడా? పదవిని లాగేస్తారన్న భయంతో చంద్రబాబు ఆదేశాల మేరకు నడుచుకుంటాడా? నాడు జలయజ్ఞం ప్రాజెక్టుల నుండి నిన్న పాలమూరు రంగారెడ్డిపై కేసులు వేసి పనులు ఆపిన వ్యవహారంలో ఆదిత్యాదాస్‌ది కీలకపాత్ర. ఏపీ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శిగా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన వ్యక్తికి తెలంగాణ నీటి పారుదల శాఖ సలహాదారు పదవి ఎందుకు కట్టబెట్టారో ప్రభుత్వం ప్రజలకు వివరణ ఇవ్వాలి. తెలంగాణ ప్రాజెక్టుల వ్యతిరేకిగా ముద్రపడ్డ వ్యక్తిని ఏ ప్రయోజనాల కోసం ఈ పదవిలో కూర్చోబెట్టారు? అని నిరంజన్ రెడ్డి అడిగారు. వ్యక్తిగతంగా ఒక ప్రభుత్వ అధికారిగా ఆయన పట్ల మాకు ఎలాంటి వ్యతిరేకత లేదు. కానీ ఆంధ్రకు కృష్ణా ప్రాజెక్టుల నుండి నీటిని తరలించడంలో ఆయనది కీలకపాత్ర.

## చేప మందు కోసం

# పోటెత్తిన ప్రజలు..

**హైదరాబాద్:** నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప ప్రసాదం పంపిణీ ప్రారంభం అయ్యింది. చేప మందు కోసం తెలుగు రాష్ట్రాలు సహా బిహార్, యూపీ, చత్తీస్‌గఢ్, ఢిల్లీ, హర్యానా రాష్ట్రాల నుంచి ప్రజలు భారీగా తరలివస్తున్నారు. వేలాదిమందితో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ కిక్కిరిసిపోయింది. మందు కోసం ఆస్తమా బాధితులు పెద్దఎత్తున వస్తున్నారు. క్యూలైన్‌లో ఉన్నవారికి నాలుగు గంటలకుపైగా సమయం పడుతోంది. భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో నాంపల్లి పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. జూన్ 9 ఉదయం 11గంటల వరకు పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు.



బత్తిని సోదరులు అందించే చేప ప్రసాదం రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. అది తీసుకుంటే ఆస్తమా, ఉబ్బసం, శ్వాస సమస్యలు తొలగిపోతాయంటూ కొందరు విశ్వసిస్తారు. దీంతో ప్రతి సంవత్సరం రెండ్రోజులపాటు బత్తిని సోదరులు చేప మందు పంపిణీ చేస్తుంటారు. మృగశిర కార్తె తర్వాత మాత్రమే వారు చేప మందు ఇవ్వడం ప్రత్యేకం. బత్తిని సోదరుల ఇంట్లో ఉన్న బావి నీటిలో ఔషధ గుణాలు ఉంటాయని కొంతమంది విశ్వసిస్తారు. ఆ నీటితో ప్రసాదం తయారు చేయడంతో శ్వాస సంబంధిత బాధితులు ఎగబడుతున్నారు. మందును చేప పిల్లల నోట్లో కుక్కి.. దాన్ని బాధితుల గొంతులో వేస్తారు. దీంతో వారికి శ్వాస సంబంధిత వ్యాధులు తగ్గుతాయని బత్తిని సోదరులు చెప్తుంటారు. కానీ ఈ మందుకు ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవు. చేపమందు కోసం వచ్చే వారి కోసం టీజీ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. నగరంలోని ప్రధాన ప్రాంతాల నుంచి నాంపల్లికి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించింది.

## ఆరోగ్యశ్రీలో మరికొన్ని వ్యాధులు

-మొదటిపేజీ తరువాయి

సంబంధించి రాష్ట్ర సచివాలయంలో మంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇప్పటివరకు ఆరోగ్యశ్రీలో అమలులో లేని యాంజియోగ్రామ్, పార్కిన్ సన్, వెన్నుపూసకు సంబంధించిన 65 అధునాతన చికిత్స విధానాలను ఇక నుంచి ఆరోగ్యశ్రీలో అమలు చేయాలని నిర్ణయించారు. అలాగే ఆరోగ్యశ్రీలో 1672 చికిత్స విధానాలు అందుబాటులో ఉండగా.. వాటిలో 1375 విధానాలకు ప్యాకేజీ ధరలు పెంచాలని వైద్య నిపుణుల సూచనల మేరకు డిప్యూటీ సీఎం నిర్ణయం తీసుకున్నారు.

## కొత్త కొత్తగా పాలన!

-మొదటిపేజీ తరువాయి

జితేందర్‌ల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం డీజీ ర్యాంకులో ఉన్న సీవీ ఆనంద్ అత్యంత కీలకమైన ఏసీబీ డీజీ పోస్టులో ఉన్నారు. డీజీ ర్యాంకులో ఉన్న మరో అధికారి జితేందర్ హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్నారు.అయితే ప్రభుత్వం మాత్రం సీనియర్ ఐపీఎస్ శివధర్‌రెడ్డి వైపే మొగ్గు చూపుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం అడిషనల్ డీజీ ర్యాంకులో ఇంటిలిజెన్స్ చీఫ్‌గా ఉన్న శివధర్‌రెడ్డిని ఇటీవల ఏర్పడిన రెండు డీజీపీ ర్యాంకు ఖాళీల భర్తీలో భాగంగా పదోన్నతి ఇచ్చి పోలీస్ బాస్‌గా నియమించే ఛాన్స్ ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం డీజీపీ ర్యాంకులో నలుగురు సీనియర్ ఐపీఎస్‌లు కొనసాగుతున్నారు. వీరిలో రవిగుప్తాతో పాటు అసెంబ్లీ ఎన్నికల రిజల్ట్స్ టైంలో అనూహ్యంగా రోడ్డు సేఫ్టీ అథారిటీ చైర్మన్‌గా బదిలీ అయిన అంజనీకుమార్, సీవీ ఆనంద్, జితేందర్ ఉన్నారు. డీజీపీ ర్యాంకులోనే విజిలెన్స్ డీజీగా ఉన్న రాజీవ్‌రతన్ గుండెపోటుతో హఠాన్మరణం పాలయ్యారు. అదేవిధంగా టీఎస్ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్‌గా పనిచేసిన సందీప్ శాండిల్య కొద్దిరోజుల క్రితం పదవీ విరమణ పొందారు. ఇలా రెండు డీజీపీ ర్యాంకులు ఖాళీ అయ్యాయి.ప్రస్తుతం హైదరాబాద్ సీపీగా ఉన్న కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, ఇంటిలిజెన్స్ అడిషనల్ డీజీగా ఉన్న శివధర్‌రెడ్డిలకు డీజీపీలుగా పదోన్నతి లభించే ఛాన్స్ ఉంది.కరీంనగర్ పోలీస్ కమిషనర్ మొహంతి, వరంగల్ కమిషనర్ అంబర్ కిషోర్‌జా, రామగుండం సీపీ శ్రీనివాసులుకు స్థాన చలనం కలిగే ఛాన్స్ ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇంటిలిజెన్స్ ఏడీజీ పోస్టులో ఉన్న శివధర్‌రెడ్డికి డీజీపీగా బాధ్యతలు అప్పగిస్తే ఆ స్థానంలోకి మరో సీనియర్ ఐపీఎస్ అధికారి రమేశ్‌రెడ్డి వెళ్లే ఛాన్స్ ఉన్నట్టు తెలుస్తోంది. ఇక ప్రస్తుతం అడిషనల్ డీజీగా ఉన్న శిఖా గోయల్ వద్ద కీలక పోస్టులైన సీఐడీ, మహిళా భద్రత విభాగం, టీఎస్ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలు ఉన్నాయి. వీటిలో కొన్నింటిని ఇతర ఐపీఎస్‌లకు అప్పగించనున్నారు.

## కేటీఆర్ రాజీనామా?

-మొదటిపేజీ తరువాయి

నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించారు. కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారు. పదేళ్లు అధికారంలో ఉన్న ఆ పార్టీ క్యాడర్ ఈ ఓటమితో కుంగిపోయింది. అయితే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కేటీఆర్ ఓటమిపై సమీక్ష చేయలేదు. వైఫల్యాలను గుర్తించలేదు. కాంగ్రెస్ పార్టీ తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిందని అదే అహంకారం ప్రదర్శించారు. ఆరు నెలల తర్వాత వచ్చిన లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుతామన్నారు. కానీ ఎన్నికలకు క్యాడర్‌ను సిద్ధం చేయలేదు. ఉత్సాహం నింపే ప్రయత్నం చేయలేదు. దీంతో లోక్‌సభ ఎన్నికల్లోనూ దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత చాలా మంది పార్టీని వీడారు. మిగతా వారు లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలుపు బాధ్యతలు తీసుకునే ప్రయత్నం చేయలేదు. దీంతో ఈ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేదు. దాదాపు 17 స్థానాల్లో మూడో స్థానంలో నిలిచింది.అసెంబ్లీ ఎన్నికల తర్వాతనే కేటీఆర్‌పై ఒత్తిడి పెరిగింది. ఆయన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతల నుంచి తప్పుకుని మరోకరికి బాధ్యతలు అప్పగించాలని క్యాడర్ డిమాండ్ చేసింది. ఈ విషయాన్ని సమీక్షలు పెడితే చెప్పాలని భావించింది. కానీ కేటీఆర్ సమీక్షలు చేయలేదు. ఓటమిని పట్టించుకోలేదు. తాజాగా లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మరింత దారుణంగా వచ్చాయి. దీంతో కేటీఆర్‌పై అసంతృప్తి తారాస్థాయికి చేరింది.పార్టీకి వరుస ఎదురు దెబ్బలు తగులుతున్నా కేటీఆర్ తమతో మాట్లాడే ప్రయత్నం చేయడం లేదన్న అసంతృప్తి బీఆర్ఎస్ క్యాడర్‌లో తమ ఆవేదనను సోషల్ మీడియా వేదికగా వ్యక్తం చేస్తోంది. కేటీఆర్ నిర్లక్ష్య వైఖరి, ఒంటెత్తు పోకడలే ఎన్నికల్లో పార్టీ తీవ్ర పరాభవం చవి చూసిందని పేర్కొంటున్నారు. ఇకనైనా ఆయన వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి నుంచి తప్పుకోవాలని ఒత్తిడి చేస్తున్నారు.రాజీనామాపై ఒత్తిడి పెరుగుతుండటంతో కేటీఆర్ రాజీనామా చేస్తారా అన్న ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. నేతల ఒత్తిడితో తప్పుకుంటే.. పార్టీపై కేటీఆర్‌కు పట్టు సడలుతుంది. అలా కాదని పదవిలో కొనసాగితే తప్పుకోవాలన్న డిమండ్లు మరింత పెరుగుతాయి. అసంతృప్తులు పార్టీ వీడే అవకాశం ఉంటుంది. మరి ఈ విషయంలో కేటీఆర్ ఏం చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

## బుద్ధవనాన్ని పర్యాటక, ఆధ్యాత్మిక డెస్టినేషన్ సెంటర్‌గా తీర్చిదిద్దుతాం

**మంత్రి జూపల్లి కృష్ణారావు**


నల్గొండ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో బుద్ధవనాన్ని పర్యాటక, ఆధ్యాత్మిక డెస్టినేషన్ సెంటర్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. టూరిజం ప్రమోషన్‌లో భాగంగా నాగార్జున సాగర్‌లోని బుద్ధవనాన్ని మంత్రి జూపల్లి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బుద్ధుడి సమగ్ర జీవిత చరిత్రను ఒకే ప్రదేశంలో ఆవిష్కరించేలా నాగార్జునసాగర్‌లో ప్రసిద్ధ బౌద్ధ క్షేత్రాన్ని గొప్పగా నిర్మించారని చెప్పారు. ఆచార్య నాగార్జునుడు నడయాడిన ఈ ప్రాంతాన్ని అంతర్జాతీయ బౌద్ధక్షేత్రంగా మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. బౌద్ధ టూరిజం సర్క్యూట్‌లో తెలంగాణలోని బుద్ధవనాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. భారతదేశానికి, ప్రపంచానికి బౌద్ధ వారసత్వం, సంస్కృతిని చాటి చెప్పాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. నాగార్జున సాగర్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం వల్ల ఆదాయంతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

## కేసీఆర్, జగన్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు: ఎమ్మెల్యే వివేక్



**తిరుమల:** తెలుగు రాష్ట్రాల మాజీ సీఎంలపై చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో కేసీఆర్, జగన్‌కు ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. అహంకారంతో విర్రవీగితే ప్రజలు ఇలాగే సమాధానం చెప్తారని ఘాటుగా స్పందించారు. ఈ మేరకు ఎమ్మెల్యే వివేక్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ.. తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో మోడీకి సైతం ఆదరణ తగ్గిందని, దానికి ఎన్డీయే కూటమి గెలుపొందని సీట్లే నిదర్శనమన్నారు ఎమ్మెల్యే వివేక్. లోక్ సభ ఎన్నికల్లో ఎన్డీఏ ప్రభుత్వం ఈడీ, సీబీఐలతో అభ్యర్థులను బెదిరించి గెలవాలని చూసిందని ఆరోపించారు. కానీ ప్రజలంతా గమనిస్తున్నారని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీకి లోక్ సభ, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో మంచి మెజారిటీ వచ్చిందన్నారు. పెద్దపల్లి ఎంపీగా వంశీకృష్ణ మంచి మెజారిటీతో గెలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అహంకార నేతలకు ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు.

# కారు దిగడానికి మరి కొందరు ఎమ్మెల్యేలు




**హైదరాబాద్ :** కేంద్రంలో ఎన్డీఏ సర్కార్ కొలువు తీరబోతోంది. ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవనున్నారు. తెలంగాణలోని లోక్సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ కు గుండు సున్నానే మిగిలింది. ఏపీలోనూ కేసీఆర్ దోస్త్ ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సీట్ల సంఖ్య అటుంచితే.. చెప్పుకోదగ్గ స్థానాలను కూడా వైసిపి సాధించలేదు. దీంతో ఈ మొత్తం వ్యవహారంలో ఎటు చూసినా..బీఆర్ఎస్ అధినేత కెసిఆర్ కు పెద్ద మైనస్ గా మారింది. వాస్తవానికి తెలంగాణలో కొన్నైనా లోక్సభ స్థానాలను గెలుచుకుంటామని గులాబీ అధినాయకత్వం అంచనా వేసుకుంది. తద్వారా కేంద్రంలో తాము చక్రం తిప్పేందుకు ఆస్కారం ఉంటుంది ఆ పార్టీ ఎక్స్పెక్ట్ చేసింది. ఒకవేళ రాష్ట్రంలో అనుకున్న స్థాయిలో లోక్సభ స్థానాలు రాకున్నా..ఏపీలో తన మిత్రుడు జగన్మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అవతారని భావించింది.పై కారణాలు చెప్పే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇన్నాళ్లు తన పార్టీ ఎమ్మెల్యేలను కాపాడుకోగలిగారు. ఆంధ్రాలో జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయితే తమకు కాస్త రిలీఫ్ ఉంటుందని లేదా తెలంగాణ లో ఎక్కువ లోక్సభ స్థానాలను గెలుచుకున్నా?తమకు ఢోకా ఉండదని వారికి నచ్చ చెప్పుకున్నారు. అయితే ఇవేవీ వర్కౌట్ కాకపోవడంతో.. ఇప్పుడు తెలంగాణ భవన్ నుంచి ఒక్కొక్కరు కాంగ్రెస్ లేదా బిజెపి వైపు వెళ్లేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. అందులో భాగంగానే మాజీమంత్రి మల్లారెడ్డి,ఆయన అల్లుడు రాజశేఖర్ రెడ్డి ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహితులు వేం నరేందర్ రెడ్డితో సంప్రదింపులు జరిపి ఆ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. అలాగే వీరి బాటలోనే మరో ఇద్దరు ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి,లక్ష్మారెడ్డిలు కూడా వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు. వాస్తవానికి గత శాసనసభ ఎన్నికల సందర్భంగా గులాబీ పార్టీ గ్రేటర్ లోనే అత్యధిక స్థానాలను గెలుచుకుంది. ఇప్పుడు ఇక్కడి నుంచే ఎమ్మెల్యేలు కారు దిగేందుకు సిద్ధపడటం కేసీఆర్ ను ఆందోళనకు గురిచేస్తుంది.ఇక పార్టీ మారే విషయంలో కెసిఆర్ కు మల్లారెడ్డి,రాజశేఖర్ రెడ్డి,సుధీర్ రెడ్డి,లక్ష్మారెడ్డిలు ఇప్పటికే క్లారిటీ ఇచ్చేశారు. తాము కాంగ్రెస్ లోకి పోవడం తప్ప మరో మార్గం లేదని తేల్చి చెప్పేశారు. ఇదే విషయం బీఆర్ఎస్ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. అంతేకాక వీరితోపాటు మరి కొంతమంది ఎమ్మెల్యేలు కారు దిగిపోతున్నట్లు ప్రచారం జరుగుతుంది. దీంతో వెంటనే అలర్ట్ కెసిఆర్ మల్లారెడ్డి, రాజశేఖరరెడ్డి,లక్ష్మారెడ్డి,సుధీర్ రెడ్డిలను ఫాంహౌజుకు పిలిపించుకొని సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికి వారి నుంచి సానుకూల దృక్పథం రాకపోవడంపై కెసిఆర్ కొంత అసహనానికి గురైనట్లు తెలుస్తుంది. అయితే వీరి పార్టీ మార్పును అడ్డుకునేందుకు కెసిఆర్ ఆ నలుగురు ఎంఎల్ఏలతో దిగిన ఫోటోను కావాలనే వైరల్ చేయించినట్లు టాక్. తద్వారా వీరు పార్టీ మారడం లేదనే సంకేతాలను పంపే ప్రయత్నం చేసినట్లు అర్థమవుతుంది. అయితే కేసీఆర్ ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ.. మెజార్టీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాత్రం కారు దిగడం ఖాయమనే ప్రచారముంది.

# పార్టీలు మారినా... మారని తలరాతలు



**వరంగల్ :** ఎన్నికలు రాగానే మొదట టికెట్ కోసం ఎదురుచూస్తారు, ఛాన్స్ లేదనుకుంటే చాలు ఆ పార్టీపై విమర్శలు, ఆరోపణలు చేసి మరో పార్టీలోకి జంప్ అవుతుంటారు. ఇటీవల జరిగిన లోక్సభ ఎన్నికల ముందు తెలంగాణలో అధికార పార్టీ కాంగ్రెస్ లోకి మారి టికెట్ దక్కించుకొన్న కొందరు నేతలు ఓటమి పాలయ్యారు. భారత రాష్ట్ర సమితి అధికారానికి దూరం కాగానే ఆ పార్టీ సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు కొందరు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరగా, మరికొందరు సిట్టింగ్ ఎంపీలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ మారిన నేతలు ఎన్నికల్లో పోటీ చేయగా ఒకే ఒక్కరు విజయం సాధించారు. మిగతా వారికి మాత్రం నిరాశే మిగిలింది. గెలిచిన ఆ ఒక్క అభ్యర్థి వరంగల్ ఎంపీ కడియం కావ్య. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో నేతలను ఆ పార్టీ ఈ పార్టీ నేతలు అని చెప్పే పరిస్థితి లేదు. ఎందుకంటే ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియని దుస్థితి. అధికార పార్టీలో ఉంటే నాయకులు ప్రతిపక్ష పార్టీలో ఉంటే నాయకులం కాదు. అనే విధంగా రాజకీయ నాయకుల వ్యవహార శైలి మారింది. ఏళ్ల తరబడి అధికారంలో ఉన్న అధికారానికి దూరమైన కొద్ది రోజులకే నేతలు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి జంప్ అవుతున్నారు. ఇలాంటి పరిస్థితి మొన్నటి లోక్సభ ఎన్నికల ముందు జరిగింది. భారత రాష్ట్ర సమితి అధికారానికి దూరం కాగానే ఆ పార్టీ సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు కాంగ్రెస్లో చేరిపోయారు. అంతే కాదు సీట్లు దక్కించుకుని పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేశారు. ఇలా బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ లోకి వెళ్లిన వారిలో చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్ రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి ఆయన భార్య సునీతా మహేందర్ రెడ్డి, స్టేషన్ ఘణపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆయన కూతురు కడియం కావ్య ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన రంజిత్ రెడ్డి చేవెళ్ల పార్లమెంట్ నుంచి, సిట్టింగ్ ఎమ్మెల్యే గా ఉన్న దానం నాగేందర్ సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి, పట్నం సునీతా మహేందర్ రెడ్డి మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి, కడియం కావ్య వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి ఎన్నికల్లో పోటీ చేశారు. అయితే పార్టీ మారినా వారి ఫేట్ మాత్రం మారలేదు. అధికార పార్టీలో ఉంటే విజయం తథ్యమని భావించిన ఈ నేతలకు నిరాశే ఎదురైంది. చేవెళ్లలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి చేతిలో రంజిత్ రెడ్డి ఓటమి చెందారు.మల్కాజిగిరి నుంచి పోటీ చేసిన సునీతా రెడ్డి.. ఈటల రాజేందర్ చేతిలో 3,91,475 ఓట్ల తేడాతో గెలుపొందారు. సికింద్రాబాద్లో గట్టి పోటీ ఇచ్చినప్పటికీ కిషన్ రెడ్డి చేతితో 49,944 ఓట్ల తేడాతో దానం నాగేందర్ కు ఓటమి తప్పలేదు. అయితే పార్టీ మారిన వారిలో వరంగల్ లో కడియం కావ్య ఒక్కరే విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేష్ పై 2,20,339 ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య విజయం సాధించారు. ఇక్కడ ప్రత్యర్థి అంత స్ట్రాంగ్ కాకపోవడంతో కావ్య గెలుపొందారని వినిపిస్తోంది. అధికారం కోసం రాత్రికి రాత్రి పార్టీలు మారినా, ఎన్నికల్లో ఓటు వేయకుండా వారిని ప్రజలు ఓడించి ఇంటికి పంపినట్లు అయింది.

## చిన్నపాటి వర్షానికే సమస్యలు



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** జిన్నారం మండలం మంగంపేట గ్రామంలో చిన్నపాటి వర్షానికే చెరువులు తలపించే విధంగా ఇంటి ముందర ఉన్న గుంతలలో బురద నిరు నిలిచి పోయి ఇంటి ముందర నుండి నడవాలంటే కూడా కష్టమైన పరిస్థితి ఏర్పడింది దీనితో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు కావున ఇట్టి సమస్య పైన గ్రామ పంచాయతీ కార్యదర్శి తగిన చర్యలు తీసుకొని సమస్యను వెంటనే పరిష్కరించాలని మంగపేట గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాచబోయిన శ్రీకాంత్ కోరారు.

## పారదర్శకంగా హెూంగార్డుల బదిలీ ప్రక్రియ పూర్తి - జిల్లా ఎస్పీ గౌష్ ఆలం



**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** శనివారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు ఆదిలాబాద్ జిల్లాలో హెూంగార్డుల బదిలీ ప్రక్రియను జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఆధ్వర్యంలో పారదర్శకంగా పూర్తి చేశారు. జిల్లా నందు ప్రతి సంవత్సరం హెూంగార్డుల బదిలీ ప్రక్రియను నిర్వహించారు. అందులో భాగంగా నిర్మల్ జిల్లా నుండి 62 హెూంగార్డులు అదేవిధంగా కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా నుండి 35 మంది హెూంగార్డులు ఆదిలాబాద్ జిల్లాకు రానుండగా వారి స్థానంలో ఆదిలాబాద్ జిల్లా నుండి మొత్తం 97 మంది హెూంగార్డులను లక్కీ లాటరీ విధానం ద్వారా బదిలీ ప్రక్రియను నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో సాధారణ విధులు నిర్వర్తించే హెూంగార్డులు, వాహన డ్రైవర్స్, దోబీలు, వంట పని చేసే వారు, వివిధ రంగాలలో విధులు నిర్వహిస్తున్న మొత్తం 97 మందిని నిర్మల్ మరియు ఆసిఫాబాద్ జిల్లాలకు ఇద్దరిని ఆదిలాబాద్ జిల్లాకు కేటాయించినట్లు తెలియజేశారు. బదిలీ ప్రక్రియను అందరూ హెూంగార్డుల నడుమ పారదర్శకంగా ఎటువంటి అపోహలు లేకుండా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి సురేందర్ రావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు నవీన్, టి మురళి, చంద్రశేఖర్, పోలీసు కార్యాలయం సిబ్బంది సూపర్ఇండెంట్ సంజీవ్, సిబ్బంది, హెూంగార్డ్ యూనిట్ అధికారులు రమేష్, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వాడపల్లికి పోటెత్తిన భక్తులు

**కొత్తపేట :** నైరుతి రుతుపవనాలు తాకిడితో వర్షాలు కురుస్తున్నప్పటికీ వర్షాన్ని సహితం లెక్కచేయకుండా తెల్లవారు జాము నుండే భక్తులు శనివారం కోనసీమ తిరుపతి వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి పోటెత్తారు. ఏడు వరాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం అంటూ విలసిల్లిన వాడపల్లి వెంకన్న భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం గా పిలుస్తారు. ఏడు వారలు పాటు వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుంటే తమ కోర్కెలు ఖచ్చితముగా నెరవేరుతాయి అని భక్తులు నమ్మకం, ఆ నమ్మకం తో దేశం నలుమూలలు నుండి అధిక సంఖ్యలో భక్తులు రావడం విశేషం, ఇటీవల ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలు కూడా దర్శనానికి వస్తున్నారు. ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ,వేగుళ్ల జోగేశ్వరరావు, ఉంగుటూరు ఎమ్మెల్యే పసమట్ల ధర్మరాజు తోపాటు పలువురు రాజకీయ నాయకులు

# ఆ ఇద్దరు ఎవరు...

**హైదరాబాద్ :** గతంలో నాలుగు సీట్లు ఉన్నాయి. ఒక్కటి అదనంగా గెలిచినా చాలు.. అది మాకు బోనస్సే.. ఇది లోక్సభ ఎలక్షన్స్ ముందు బీజేపీ నేతల మాటలు.. బట్ ప్రజలు మాత్రం వారి అంచనాలకు మించి సీట్లు ఇచ్చారు. ఏకంగా ఎనిమిది మంది బీజేపీ అభ్యర్థులను గెలిపించారు. మరి ఇది తెలంగాణకు మంచి చేయబోతుంది? గెలిచారన్న సంతోషమేనా? మరి మనకు జరిగే లాభం ఏమైనా ఉందా? ప్రజలు ఆశిర్వదించారు.. మేము అనుకున్నదానికంటే చాలా బాగా పోరాడాము.. ఇవి తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి చెబుతున్న మాటలు.. యస్.. నిజంగానే మొత్తం 17 స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు కాంగ్రెస్ అభ్యర్థులకు గట్టి పోటీ ఇచ్చారు. తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల చరిత్రలో బీజేపీ ఈ స్థాయిలో సీట్లు గెలుచుకోవడం ఇదే ఫస్ట్ టైమ్.. మరి తెలంగాణ ప్రజలకు బీజేపీ ఎలాంటి రిటర్న్ గిఫ్ట్ ఇస్తుంది? రాష్ట్రానికి ఏం మేలు చేస్తుంది? ఇదే ఇప్పుడు మెయిన్ క్వశ్చన్.లాస్ట్ లోక్సభ ఎలక్షన్స్లో తెలంగాణలో నాలుగు ఎంపీ సీట్లు గెలుచుకుంది. ఇప్పటి బీఆర్ఎస్.. అప్పటి టీఆర్ఎస్ హవా నడుస్తున్న సమయం అది. ఆ హవాలో కూడా అనూహ్యంగా నాలుగు ఎంపీ సీట్లను కైవసం చేసుకుంది బీజేపీ. దీనికి ప్రతిఫలంగా ఒక కేంద్ర సహాయమంత్రి పదవిని కల్పించింది అప్పటి మోడీ సర్కార్.. బస్.. అంతే.. అంతకుమించి రాష్ట్రానికి జరిగిన వృద్ధి ఏం లేదనేది ఇప్పటికీ ఉన్న విమర్శలు. ప్రాజెక్టులు, నిధుల విషయంలో కూడా కేంద్ర నుంచి తెలంగాణకు ఒరిగిందేం లేదన్న టాక్ ఉంది. కానీ ఈసారి సిట్యువేషన్ వేరు. కాస్త అన్యాయం జరిగిందని ప్రచారం జరిగినా.. తెలంగాణ ప్రజలు దానిని పక్కన పెట్టారు. బీజేపీకి జై కొట్టారు.. ఎనిమిది మంది ఎంపీలను గెలిపించారు. మరి ఈసారైనా న్యాయం జరుగుతుందా? తెలంగాణ బీజేపీ ఎంపీలకు కీలకమైన మంత్రిత్వశాఖలు దక్కుతాయా?ఇప్పుడు దీనిపైనే తెలంగాణ పొలిటికల్ సర్కిళ్లలో హాట్ డిబేట్ నడుస్తుంది..అయితే ఈసారి నలుగురికి మంత్రి పదవులు దక్కుతాయన్న చర్చ నడుస్తుంది. నిజానికి బండి సంజయ్, ధర్మపురి అర్వింద్ ఎంపీలుగా గెలవడం ఇది రెండోసారి.. సో.. వీరిద్దరు కూడా మంత్రి పదవి రేసులో ఉన్నారు. తొలిసారి విజయం సాధించిన డీకే అరుణ, ఈటల రాజేందర్ కూడా మంత్రి పదవి రేసులో ఉండే చాన్స్ ఉంది. గతంలోనే కిషన్ రెడ్డి మంత్రి పదవి దక్కించుకున్నారు కాబట్టి.. ఆయనకు ఈసారి మళ్లీ పదవి ఇస్తారా? లేదా? అనేది డౌట్.. బీసీ కోటాలో ఈటలకు లేదా బండి సంజయ్కు.. మహిళా కోటాలో డీకే అరుణకు పదవీయోగ్యం దక్కే చాన్స్ ఉంది.అయితే బీజేపీకి పూర్తి స్థాయిలో మెజార్టీ రాకపోవడం చాలా మంది ఆశావాహులకు దెబ్బ అనే చెప్పాలి. ఎందుకంటే బీజేపీ మిత్ర పక్షాలు డిమాండ్స్ పెరిగిపోయాయి. తమకు కావాల్సిన మంత్రి పదవులు ఇన్ని.. శాఖలు ఇవి..అంటూ చాంతాడంతా లిస్ట్ను బీజేపీ పెద్దల ముందు ఉంచుతున్నారు. సో.. ఎక్కువ సంఖ్యలో మంత్రి పదవులు మిత్ర పక్షాలకు వెళితే.. చాలా వరకు బీజేపీ ఆశావాహులకు పదవులు దక్కే అవకాశం ఉండకపోవచ్చు. అందులో తెలంగాణ బీజేపీ ఎంపీలు ఉండే అవకాశం కూడా లేకపోలేదు.అయితే మోడీ సర్కార్ చాలా విషయాల్లో తెలంగాణకు మొండి చేయ్యే చూపించిందని చెప్పాలి. ఖాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని నిర్మిస్తామన్నారు. దానిని నాన్చి



నాన్చి.. చివరకు మరమ్మతుల కేంద్రంగా మార్చేశారు. అది కూడా ఎన్నికల ముందు ప్రకటించారు. ఇక నిజామాబాద్ పసుపు బోర్డు కూడా.. ఐదేళ్లు నాన్చి నాన్చి.. దానిని కూడా సరిగ్గా ఎన్నికల ముందు అనౌన్స్ చేశారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ అయితే అటకెక్కింది. ట్రైబల్ యూనివర్సిటీ డీపీఆర్కే పరిమితమైంది. మామునూరు ఎయిర్పోర్ట్ విషయమైతే ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్టుగా ఉంది. ఇవన్నీ పాత ప్రాజెక్టులో.. మరి వీటిని పూర్తి చేసి మమ అనిపిస్తారా? లేక కొత్త వాటిని ఏమైనా రాష్ట్రానికి తీసుకొస్తారా? అనేది చూడాలి.యస్.. ఈటల రాజేందర్ చెప్పింది నిజమే. ఎన్నో కలలతో బీజేపీ ఎంపీలను గెలిపించారు తెలంగాణ ప్రజలు. మీ పార్టీ ఓట్ షేర్ను పెంచారు. మీరు కూడా ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకండి. తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవిస్తూ.. ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేయండి.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com